మీసాల రాముడి కల్యాణం చూతము రారండి

- ప్రపంచంలో ఎక్కడా కనిపించని మీసాలరాముడి దర్శనం ఇక్కడి ప్రత్యేకం
- అయోధ్య రామచంద్రజీ మఠం ఆధ్వర్యంలో నిర్వహణ
- అప్పులు తీర్చే దేవుడిగా ప్రజల నమ్మకం
- 17న కల్యాణం, 18న మహా పట్టాభిషేకం



మీసాల రాముడి కల్యాణం (ఫైల్)

లంగర్‌హౌస్: ప్రపంచంలో ఎక్కడ లేని మీసాల రాముడి దర్శనం హైదరాబాద్ లంగర్‌హౌస్ త్రివేణి సంగంలో చేసుకోవచ్చు. నిజాం తానీషాల కాలంలో భక్తరామదాసు గోపన్న భద్రాచలంలో జానకీరాములకు ఆలయాన్ని నిర్మించారు. లంగర్‌హౌస్‌లోని త్రివేణి సంగం ఒడ్డున మీసాల రాముడు కొలువుదీరిన శ్రీరామచంద్రజీ మఠం వెలసింది. భద్రాద్రికి, 800 ఏళ్ల చరిత్ర కలిగిన సంగంలోని జానకీ సమేత వీరవెంకట విజయ రాఘవస్వామి మఠ ఆలయానికి అవినాభావ సంబంధం ఉంది. మీసాల రామయ్యకు కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. భద్రాద్రి రామయ్యకు తీసిపోకుండా పీఠాధిపతి 1008 రాహుల్‌దాస్ బాబా ఆధ్వర్యంలో వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలు, సీతారాముల కల్యాణాన్ని నిర్వహిస్తున్నారు.

అప్పులు తీర్చే దేవుడు మీసాల రామయ్య..

నిజాంకాలంలో కంచర్ల గోపన్న భక్తరామదాసు రాముని కోసం భద్రాద్రిలో రామాలయం నిర్మించిన విషయం తెలిసినదే. భక్తరామదాసును గోల్కొండ నవాబు బంధించిన సమయంలో రామలక్ష్మణులు మారు వేషంలో వచ్చి 6 లక్షల వరహాల రొక్కం చెల్లించి రామదాసును విడిపించారు. రామదాసును విడిపించడానికి రొక్కం చెల్లించాడని ఇక్కడ స్వామిని వేడుకుంటే అప్పులు తీరుతాయని అప్పులు తీర్చే దేవునిగా కూడా ఈ మీసాల రాముడిని కొలుస్తున్నారు.

17న కల్యాణ మహోత్సవం..

అయోధ్య రాంచంద్రజీ మఠ ఆలయ ఆధ్వర్యంలో సేవలు అందుకుంటున్న మీసాల రాముడి కల్యాణ వైభోగ వేడుకలు ఈనెల 17వ తేదీ బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించనున్నారు. జానకీ దేవి, శ్రీరాముడు స్వయంగా వచ్చి వివాహం ఆడుతున్నారా అనిపించేలా రాంలీలా మైదానంలో పీఠాధిపతి 1008 రాహుల్‌దాస్ బాబా ఆధ్వర్యంలో లక్షల మంది భక్తులు తిలకిస్తుండగా వివాహ వేడుకలు నిర్వహించనున్నారు. చెన్నై నుంచి వచ్చిన కళాకారుల అందమైన గజమాలలతో బ్రహ్మోత్సవాల్లో స్వామిని సుందరంగా అలంకరించనున్నారు. 18వ తేదీ ఉదయం చక్రస్నానం, శ్రీరామునికి మహా పట్టాభిషేకంతో వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.



భక్తరామదాసును విడిపించడానికి మీసాల రాముడు చెల్లించిన రొక్కం

నేడు వసంతోత్సవం..

శ్రీరామనవమి పురస్కరించుకొని నేడు మీసాలరాముడు, జానకీ దేవిలకు మంగళ స్నానాలు నిర్వహించనున్నారు. ప్రశాంత్‌నగర్‌లోని ముత్యాల లీలావతి నివాసంలో సాయిటెక్ ముత్యాల సుమలత, శేఖర్‌బాబు దంపతులు జానకీ దేవిని పెళ్లికూతురు ముస్తాబు వేడుక నిర్వహించనున్నారు. మామిడాకుల స్వప్నకుమారి, కృష్ణ దంపతులు వారి గృహంలో వేదపండితులతో శ్రీరాముడి పెళ్లి కొడుకు ముస్తాబు కార్యక్రమం నేడు సాయంత్రం నిర్వహిస్తారు. అనంతరం సంగం రామచంద్రజీ ఆలయంలో వసంతోత్సవం నిర్వహిస్తారు. ఈ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్ల కృపాశీస్సులు పొందాలని నిర్వాహకులు కోరారు.

సీతారాముల పెళ్లికి అందరూ పెద్దలే..



సంగం శ్రీరామచంద్రీ మఠ ఆలయంలో సాలిగ్రామ శిలతో స్వయంభూలుగా సీతారామలక్ష్మణులు వెలిశారు. రాంలీలా మైదానంలో వేదపండితులతో నిర్వహించే రాములోరి కల్యాణానికి అందరూ పెద్దలే. పెద్దయెత్తున భక్తులు తరలివచ్చి స్వామివారి కల్యాణాన్ని తిలకించి తీర్థప్రసాదాలు, తలంబ్రాలు స్వీకరించిన వారు కైవల్యప్రాప్తి పొందుతారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా సహాయం అందించేందుకు సేవకులు కూడా అందుబాటులో ఉంటారు. - పీఠాధిపతి 1008 రాహుల్‌దాస్ బాబా

శ్రీరామ నవమి శోభాయాత్రకు సర్వం సిద్ధం

- నిఘా నీడలో శ్రీరాముడి శోభాయాత్ర
- వెయ్యి మంది పోలీసులతో భారీ బందోబస్తు
- అన్ని ఏర్పాట్లు చేస్తున్న అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ గిరిధర్, ఏసీపీ శంకర్, సీఐ శ్రీనివాసచారి



శోభాయాత్ర ప్రాంతాల్లో చెట్ల కొమ్మలను తొలగిస్తున్న విద్యుత్ సిబ్బంది

సుల్తాన్‌బజార్: శ్రీరామనవమిని పురస్కరించుకుని మంగళ్‌హాట్ నుంచి సుల్తాన్‌బజార్ హనుమాన్ వ్యాయామశాల వరకు జరిగే ర్యాలీ ప్రశాంతమైన వాతావరణంలో జరిగేందుకు పోలీసులు సర్వం సిద్ధం చేశారు. ఈస్ట్‌జోన్ డీసీపీ రావుల గిరిధర్ నేతృత్వంలో ర్యాలీ జరిగే ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అన్ని ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. శ్రీరామనవమి శోభాయాత్ర మంగళ్‌హాట్ నుంచి కోఠి హనుమాన్ వ్యాయామశాల వరకు జరుగుతుంది. సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ముగిస్తుండడంతో ఇక్కడే బహిరంగ సభ కీలకంగా మారనుంది. వేలాది మంది భక్తులు హాజరయ్యే సభకు భారీ బందోబస్తును పోలీసులు ఏర్పాటు చేసేందుకు ఒక ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. ఇప్పటికే సుల్తాన్‌బజార్ అఫ్జల్‌గంజ్, బేగంబజార్, షాహినాయత్‌గంజ్, మంగళ్‌హాట్, పీఎస్ పరిధిల్లో మరమ్మతులకు నోచుకోని సీసీ కెమెరాలను బాగుచేస్తున్నారు.

భారీ బందోబస్తు..

శోభాయాత్రలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకుండా పోలీసులు వెయ్యి మంది పోలీసు బలగాలతో బందోబస్తును ఏర్పాటు చేశారు. ఇప్పటికే ర్యాలీ జరిగే ప్రాంతాల్లో అడ్డుగా వచ్చే చెట్ల కొమ్మలను విద్యుత్‌శాఖ సిబ్బందితో సమన్వయం చేసుకుని వాటిని తొలగిస్తున్నారు. అదేవిధంగా ర్యాలీ జరిగే ప్రాంతాల్లో గోతులమయంగా ఉన్న రోడ్లకు ప్యాచ్‌వర్క్ పనులు ప్రారంభమయ్యాయి. డీసీపీ గిరిధర్ ఆధ్వర్యంలో అఫ్జల్‌గంజ్, సుల్తాన్‌బజార్, బేగంబజార్ పోలీస్ స్టేషన్ల పరిధిల్లో కేంద్ర బలగాలతో ఫ్లాగ్‌మార్చ్‌ను నిర్వహిస్తున్నారు.

శాంతియుతంగా ర్యాలీ నిర్వహించుకోవాలి : ఈస్ట్‌జోన్ డీసీపీ రావుల గిరిధర్

శ్రీరామనవమి శోభాయాత్రలు ప్రజలు శాంతియుతంగా నిర్వహించుకోవాలి. ఇప్పటికే పీస్ కమిటీ సభ్యులతో సమావేశాలు నిర్వహించాం. సమస్యాత్మక ప్రాంతాల్లో నిఘా ముమ్మరం చేశాం. వెయ్యి మంది పోలీసు బలగాలతో ఉన్నతాధికారుల పర్యవేక్షణలో ఈ ర్యాలీ కొనసాగుతుంది. ఇంటలిజెన్స్, స్పెషల్‌బ్రాంచ్, ట్రాఫిక్, టాస్క్‌ఫోర్స్, డీసీఎస్‌పీ తదితర పోలీసు బలగాలతో ఫ్లాగ్ మార్చ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ప్రజలు అభిప్రాయాలు తీసుకుంటున్నాం. సుల్తాన్‌బజార్‌లో శోభాయాత్ర ముగింపు, బహిరంగ సభ ఉండడంతో ఇక్కడే అధిక ఫోకస్ చేస్తున్నాం.

'కాళేశ్వరం' అవినీతిని బహిర్గతం చేయాలి



విలేకర్లతో మాట్లాడుతున్న కేఏ.పాల్

సుల్తాన్‌బజార్: లక్ష కోట్ల విలువైన కాళేశ్వరం ప్రాజెక్ట్ అవినీతిని బహిర్గతం చేయాలని గ్లోబల్ పీస్ ప్రెసిడెంట్ అండ్ ప్రజా శాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ.పాల్ డిమాండ్ చేశారు. సోమవారం కోఠిలోని సీబీఐ కార్యాలయంలో ఆయన కాళేశ్వరం ప్రాజెక్ట్ అవినీతిపై ఫిర్యాదు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..భారతదేశంలో అతిపెద్ద కుంభకోణం కాళేశ్వరం ప్రాజెక్టు అన్నారు. ఈ ప్రాజెక్ట్ అవినీతిపై తాను ఏప్రిల్ 2న ప్రజా ప్రయోజన వాజ్యాన్ని దాఖలు చేయడం జరిగిందన్నారు. ఏప్రిల్ 10న హైకోర్టు కొన్ని ఆదేశాలు జారీ చేసిందని, ఈ అతిపెద్ద భారతీయ కుంభకోణం మెగా కృష్ణారెడ్డి కంపెనీల అవినీత, రాజకీయ పార్టీల టుక్ డాశ్‌లపై సీబీఐ విచారణ చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజలకు న్యాయం జరిగే వరకు పోరాడుతామని ఆయన అన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం



ఇంటింటి ప్రచారంలో బీజేపీ అభ్యర్థి మాధవీలత

గోల్కొండ: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ హైదరాబాద్ పార్లమెంటు నియోజకవర్గం అభ్యర్థి కె.మాధవీలత అన్నారు. సోమవారం ఆమె కార్వాన్, గుడిమల్కాపూర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఆమె మాట్లాడుతూ.. కేవలం మైనార్టీ ఓట్ల పేరుతో మజ్లిస్ పార్టీ హైదరాబాద్ నుంచి గెలుస్తూ వస్తుందన్నారు. హైదరాబాద్ నగరాన్ని మాత్రం ఆ పార్టీ అభివృద్ధి చేయలేదని ఆరోపించారు. దేశంలో పదేళ్ల బీజేపీ పాలన అభివృద్ధి అంటే ఏమిటో అర్థం పట్టినట్లు చూపిస్తుందని ఆమె అన్నారు. ప్రతి ఒక్కరూ తనకు ఓటు వేసి గెలిపించాలని ఆమె కోరారు. హైదరాబాద్ పార్లమెంటు బీజేపీ కన్వీనర్ ఇంద్రసేనారెడ్డి, శివరత్నం, దోరుతుల శ్రీనివాస్, గోవర్ధన్, మధుసూదన్, దేవర వంశీ తదితరులున్నారు.

హైదరాబాద్ లోక్‌సభ స్థానాన్ని గెలుస్తాం



జియాగూడలో ప్రచారం చేస్తున్న మాధవీలత

జియాగూడ: హైదరాబాద్ పార్లమెంట్‌లో భారీ మెజార్టీతో విజయం సాధిస్తానని బీజేపీ అభ్యర్థి మాధవీలత అన్నారు. సోమవారం జియాగూడలో సమర్థ నారాయణ ఆశ్రమంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఇంటింటికీ పాదయాత్ర నిర్వహించారు. సంజయ్‌నగర్, ఇమాంపురా, దుర్గానగర్, వెంకటేష్‌నగర్, కేఎస్‌నగర్, న్యూ గంగానగర్, కేసరి హనుమాన్, దర్బార్ మైసమ్మ తదితర ప్రాంతాల్లో తనకు ఓటువేసి గెలిపించాల్సిందిగా కోరారు. బీజేపీ సీనియర్ నాయకులు డిజ్వర్ సింగ్, కార్వాన్ కన్వీనర్ గోవర్ధన్, దర్పల్లి నర్సిములు, గోల్కొండ జిల్లా డెయిరీ సెల్ కన్వీనర్ శివకుమార్ యాదవ్, అధ్యక్షుడు లక్ష్మీనారాయణ్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్‌యాదవ్, రామ్‌కుమార్, సుదర్శన్ పాల్గొన్నారు.

సన్మానం



రాజ్‌నారాయణ్ ముదిరాజ్‌ను సన్మానిస్తున్న రామరాజు

చార్మినార్: సామాజిక సేవా కార్యక్రమాల్లో నాలుగు దశాబ్దాలుగా ఎన్నో సేవలను అందజేసిన సందర్భంగా తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ చైర్మన్, తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్‌ను దక్షిణ మండలం శాంతి సంక్షేమ సంఘం అధ్యక్షుడు రామరాజు ఘనంగా సన్మానించారు. జంగమ్మెట్‌లోని గ్లోరీ పబ్లిక్ స్కూల్‌లో సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో ధర్మేందర్ రావు, కాశమోని శ్యాంరావు ముదిరాజ్,మహేష్ తదితరులు హాజరై డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్‌ను సన్మానించి అభినందనలు తెలిపారు.

'అభివృద్ధికి చిరునామా మజ్లిస్ పార్టీ'



గోల్కొండ: అభివృద్ధికి చిరునామా మజ్లిస్ పార్టీ అన్న విషయాన్ని ప్రతి ఒక్కరికి తెలుసని ఆ పార్టీ కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. కార్వాన్‌కు చెందిన పలువురు మజ్లిస్ సీనియర్ నాయకులు సోమవారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మజ్లిస్ పార్టీ సెక్యూలర్ విధానాలతో ముందుకు సాగుతుందన్నారు. సయ్యద్ రఫత్‌హుస్సేన్, మహ్మద్ ఉన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



చార్మినార్: విద్యార్థుల్లో దాగి ఉన్న సాంస్కృతిక కళా వైభవ్యాన్ని వెలికి తీసేలా ప్రతి ఏడాది ఏబీవీపీ ఆధ్వర్యంలో రాష్ట్రీయ కళా మంచ్ సింగిడి పేరుతో పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీ అన్నారు. ఇందులో భాగంగా ఈ ఏడాది ఈ నెల 20, 21వ తేదీల్లో ఉస్మానియా విశ్వవిద్యాలయం వేదికగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. సోమవారం ప్రభుత్వ సిటీ కాలేజీ ఆవరణలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ సబావట్ కల్యాణ్ ,రాహుల్, రమేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

డీసీపీకి ఆహ్వానం



డీసీపీని ఆహ్వానిస్తున్న శ్రీనివాసారావు

చాంద్రాయణగుట్ట: ఈనెల 17న ఉప్పుగూడలో నిర్వహించనున్న శ్రీరామ శోభాయాత్రకు హాజరవ్వాలని శ్రీరామసేన నిర్వాహకుడు తాడెం శ్రీనివాసారావు దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్యను కోరారు. ఈ మేరకు డీసీపీని ఆయన కార్యాలయంలో కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఆయనను కలిసిన వారిలో నాయకులు గంజి వేణు, శివ, కిరణ్ తదితరులున్నారు.

ఎన్నికల నిర్వహణలో సెక్టోరల్ అధికారుల పాత్ర కీలకం

- ప్రతి పోలింగ్ స్టేషన్ ను పరిశీలించాలి
- పోలింగ్ కేంద్రాల్లో వసతులపై నివేదిక ఇవ్వాలి
- హైదరాబాద్ రిటర్నింగ్ అధికారి అనుదీప్ దురిశెట్టి



మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

సాక్షి,సిటీబ్యూరో: ఎన్నికల నిర్వహణలో సెక్టోరల్ అధికారుల పాత్ర కీలకమని హైదరాబాద్ లోక్‌సభ రిటర్నింగ్ అధికారి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో మలక్‌పేట్, కార్వాన్, గోషామహల్ అసెంబ్లీ సెగ్మెంట్ ఏఆర్‌ఓ,సెక్టర్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి సెక్టోరల్ ఆఫీసర్ తనకు కేటాయించిన అన్ని పోలింగ్ స్టేషన్లను సందర్శించి ఆయా పోలింగ్ కేంద్రాల్లో వసతులు సక్రమంగా ఉండేలా చూసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో వసతులపై మంగళవారం సాయంత్రంలోగా తనకు నివేదిక అందజేయాలని ఆదేశించారు. పోలింగ్ ముందు రోజు, పోలింగ్ రోజు సమర్పించే నివేదికలను సంబంధిత నమూనా ఫార్మాట్‌లో పంపాలని సూచించారు. సెక్టోరల్ అధికారులకు మెజిస్ట్రీరియల్ పవర్స్ ఇవ్వనున్నట్లు తెలిపారు. మాక్ పోల్ విషయంలో జాగ్రత్త వహించాలని, సంబంధించిన షీట్స్‌ను బాక్స్ లో నుంచి తీసివేసేలా చూడాలన్నారు. కంట్రోల్ యూనిట్‌ను సీల్ చేయాలని, పనిచేయని బీయూ, సీయూ, వీవీ ప్యాడ్స్‌ను తొలగించి వాటి స్థానంలో వెంటనే రిప్లేస్ చేయాలన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ వెంకటాచారి, ఏ ఆర్ ఓ లు, సెక్టోరల్ అధికారులు, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ జహురుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మకు 20 గ్రాముల బంగారు పుస్తెలు

చాంద్రాయణగుట్ట: లలితాబాగ్ మల్లికార్జుననగర్‌లోని శ్రీ విఘ్నేశ్వర సాయిధామంలో ఈనెల 17న నిర్వహించనున్న సీతారామచంద్ర స్వామి తిరు కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకొని సీతమ్మకు 20 గ్రాముల బంగారు పుస్తెలు చేయించడం జరిగిందని ఆలయ కమిటీ అధ్యక్షుడు బొడ్డు వెంకటేష్ తెలిపారు. ఆలయ కమిటీ కోశాధికారి గుండు శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి, వర్కింగ్ ప్రసిడెంట్ కంపె మల్లేష్, బొడ్డుపల్లి నవీన్ చారితో కలిసి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నామని ఆయన తెలిపారు.

సిటీ కాలేజీలో అంబేద్కర్ జయంతి



మాట్లాడుతున్న డాక్టర్ బాల భాస్కర్

చార్మినార్: భారత దేశానికి తన రాజ్యాంగంతో ఒక దిశా నిర్దేశం చేసిన దార్శనికుడు డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ అని ప్రభుత్వ సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బాల భాస్కర్ కొనియాడారు. అంబేడ్కర జయంతిని పురస్కరించుకుని సోమవారం సుశీల్ అనే డిగ్రీ విద్యార్థి అందజేసిన అంబేడ్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ యాదగిరి, డాక్టర్ రత్నప్రభాకర్, డాక్టర్ శంకర్, డాక్టర్ తిరుపతి తదితరులు పాల్గొని ప్రసంగించారు.

రాజాసింగ్‌తోనే గోషామహల్ అభివృద్ధి



అబిడ్స్: గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌ను గోల్కొండ జిల్లా బీజేపీ కిసాన్‌మోర్చ ప్రధాన కార్యదర్శి ముక్క కృష్ణ ఆధ్వర్యంలో సత్కారం చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ముక్క కృష్ణ మాట్లాడుతూ..రాజాసింగ్‌తోనే గోషామహల్ నియోజకవర్గం అభివృద్ధి వేగంగా జరుగుతుందన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సత్కారం



రేవంత్‌రెడ్డిని సత్కరిస్తున్న సంతోష్‌గుప్తా, మమతా గుప్తా

అబిడ్స్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని గోషామహల్ నియోజకవర్గం కాంగ్రెస్ నాయకుడు సంతోష్‌గుప్తా, మాజీ కార్పొరేటర్ మమతా గుప్తా సోమవారం సత్కరించారు. కాంగ్రెస్‌లో చేరిన వారు రేవంత్‌రెడ్డిని కలిసి మెమెంటో అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..సికింద్రాబాద్, హైదరాబాద్ పార్లమెంట్ స్థానాలతో పాటు తెలంగాణ నలుమూలలా కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలు గెలుచుకుంటుందన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రగతి, అభివృద్ధితోనే అన్నివర్గాల ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరిస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీని పటిష్టం చేయడంతో పాటు సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేస్తామన్నారు.

భాగ్యలక్ష్మి అనుగ్రహంతోనే తెలంగాణ అభివృద్ధి



అమ్మవారిని దర్శించుకున్న పీఠాధిపతులు

చార్మినార్: చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారి దేవాలయాన్ని సోమవారం విశాఖ శారదా పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామి సందర్శించారు. ఆలయ ట్రస్టీ శశికళ పీఠాధిపతులకు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికారు. అమ్మవారికి స్వయంగా కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందూ సమాజం అంతా కలిసి ఈ దేవాలయాన్ని రక్షించుకోవడం చాలా గొప్ప విషయం అని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఇంతగా అభివృద్ధి చెందడానికి కారణం భాగ్యలక్ష్మి అమ్మవారి అనుగ్రహమేనని అన్నారు. మహాలక్ష్మి అమ్మవారి అనుగ్రహంతో దేశ ఆర్థిక రాజధానిగా ముంబై నగరం వెలుగొందుతున్నట్లుగానే, భాగ్యలక్ష్మి అమ్మవారి అనుగ్రహంతో హైదరాబాద్ నగరం వెలుగొందగలదని వారు తెలిపారు. దేవాలయ అభివృద్ధికి ఎలాంటి అవసరం ఉన్నా విశాఖ శారద పీఠం సహకారం అందిస్తుందని వారు తెలిపారు. ఆలయ పాలక మండలి సభ్యులందరూ పీఠాధిపతులు ఆశీస్సులు పొందారు.

ఆకట్టుకున్న 'అర్ధనారీశ్వరం'



గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో హిరణ్మయి నాట్యాలయ ఆధ్వర్యంలో 'అర్ధనారీశ్వరం'పేరిట సోమవారం రవీంద్రభారతిలో నిర్వహించిన నృత్య రూపకం ఆకట్టుకుంది. వివిధ రాష్ట్రాలకు చెందిన శివభక్తుల ప్రయాణ సమూహ నృత్యాలు ఒకే వేదికపై ప్రదర్శించిన తీరు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. తుల్జాపూర్, మధురై, కాశీ, కలకత్తా, అల్లంపూర్ ప్రాంతాల నృత్యం కనువిందు చేసింది. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు హాజరై నృత్యగురువు బి.ప్రియాంక చేసిన ప్రయత్నం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, కేంద్ర సంగీత నాటక అకాడమి అవార్డు గ్రహీత భాగవతుల సేతురామ్, కూచిపూడి నృత్యగురువు కళాకృష్ణ, ఆధ్యాత్మిక వేత్తలు గురురోహిత్ ఆర్య, రాజశ్రీ నాండే, అర్ధనారేశ్వర టెంపుల్ చైర్మన్ మహిపాల్, మధులత తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా సంతోష్ ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న సరాబు సంతోష్ కుమార్

గౌలిపురా: లాల్‌దర్వాజా గౌలిపురా ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడిగా సరాబు సంతోష్ కుమార్ ప్రమాణ స్వీకారం సోమవారం కన్యాకపరమేశ్వరి ట్రస్ట్ భవనం గౌలిపురాలో నిర్వహించారు. హైదరాబాద్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు సరాబు లక్ష్మణ్‌గుప్తా నూతన కార్యవర్గాన్ని ప్రమాణ స్వీకారం చేయించారు. మాజీ అధ్యక్షుడు శ్రీధర మల్లికార్జున్‌గుప్తాతో కొత్త అధ్యక్షుడికి పదవీ బాధ్యతలు అప్పగించారు. ఈ కార్యక్రమంలో సంతోష్ కుమార్ తన కొత్త కార్యవర్గాన్ని నియమాకం చేశారు. ప్రధాన కార్యదర్శిగా గుబ్బ శ్రీనివాస్, కోశాధికారిగా పడకండి వెంకటేష్, వైస్ ప్రెసిడెంట్ అడ్మిన్‌గా ఇరుకుల భిక్షపతి గుప్తా, అదనపు ప్రధాన కార్యదర్శిగా కొల్కూరి నర్సింహులు గుప్తా, సహాయ కోశాధికారిగా బలున రవి కుమార్ గుప్తా, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ముక్క శేఖర్ గుప్తా, పీఆర్‌ఓగా సరాబు ఉదయ్ భాస్కర్ గుప్తా, గ్రీటింగ్ కమిటీ చైర్మన్‌గా బిజుగం చంద్రమోహన్ గుప్తాను నియమించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా అమన్‌నగర్ రామదూత ఆశ్రమానికి చెందిన శివానందగిరి స్వామి, తెలంగాణ రాష్ట్ర ఎమ్మెల్సీ బుగ్గారపు బొగ్గారపు దయానంద్ గుప్తా, మాజీ పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా, సంఘ సేవకులు చీకోటి ప్రవీణ్ కుమార్, అల్లాడి నాగభూషణం గుఅప్త, కాసెట్టి పాండు గుప్తా, రెడ్డి శెట్టి చంద్రశేఖర్ రావు, మేడం దయాకర్ గుప్తా, సంఘం మాజీ అధ్యక్షులు చీల రాములు గుప్తా, సరాబు విశ్వేశ్వరయ్య గుప్తా, గుగ్గిళ్ల అశోక్ కుమార్ గుప్తా, కండే రామలింగం గుప్తా, కొరివి వెంకటేష్ గుప్తా, ప్రాజెక్టు చైర్మన్ శ్రీరా కోటయ్య గుప్తా, కూన వెంకట గోపాల కృష్ణ, శ్రీనివాస్ గుప్తా పాల్గొన్నారు.

జగన్‌పై దాడి దుర్మార్గపు చర్య



మెట్టు రాఘవేంద్ర

అబిడ్స్: ఏపీ సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డిపై రాయితో దాడి చేయడం దుర్మార్గమైన చర్య అని రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, టీటీడీ అడ్వైజరీ కమిటీ వైస్ చైర్మన్ మెట్టు రాఘవేంద్ర పేర్కొన్నారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. ప్రజల్లో జగన్‌పై ఉన్న ప్రజాధారణ చూసి జీర్ణించుకోలేని వారి రాయితో దాడి చేయించారన్నారు. ప్రజా స్వామ్యమంలో ఇలాంటి దాడులు చేయడం అవివేకమైన చర్య అన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా జగన్ మరోసారి ముఖ్యమంత్రి అవుతారని ఆయన పేర్కొన్నారు.

ఆధ్యాత్మిక భావాలను పెంపొందించేందుకు కృషి



అబిడ్స్: ఆధ్యాత్మిక భావాలను పెంపొందించేందుకు జాగరణ్ వేడుకలు ఎంతో దోహద పడుతాయని గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకుడు ఆల పురుషోత్తమ్ రావు పేర్కొన్నారు. రహింపురాలో జరిగిన జాగరణ్ వేడుకల్లో ఆయన పాల్గొని పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ..పదేళ్లపాటు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం ఆధ్యాత్మిక భావాలను పెంపొందించేందుకు, ఆలయాల అభివృద్ధికి, తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలను చాటేందుకు ఎంతో కృషి చేసిందన్నారు.

కత్తితో బెదిరించి డబ్బులు లాక్కున్న ఇద్దరికి రిమాండ్

గౌలిపురా: చార్మినార్ సందర్శనకు వచ్చిన పర్యాటకులకు కత్తితో బెదిరించి డబ్బులు లాక్కున్న ఇద్దరిని మొఘల్‌పురా పోలీసులు సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ పి.నాగదుర్గా ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం..మహారాష్ట్రకు చెందిన యూసుఫ్ నదాఫ్ తన స్నేహితులైన రెహాన్ పైసన్ రదాఫ్, జుబేర్ తంబోలి, షేక్ మెహరాజ్ ఈనెల 11న మధ్యాహ్నం 12.30 గంటలకు చార్మినార్ సందర్శనకు వచ్చారు. వీరందరూ కలిసి చార్మినార్‌ను సందర్శిస్తుండగా వట్టెపల్లి రోషన్ కాలనీకి చెందిన షేక్ జహంగీర్ అలియాస్ తోటు సల్మాన్ (24), షేక్ ముస్తాక్ అలియాస్ ముజ్జులు నంబర్ ప్లేట్ లేని బైక్‌పై యూసుఫ్ స్నేహితుల వద్దకు వచ్చి కత్తి చూపించి బెదిరించారు. కత్తి చూపిస్తూ మీ వద్ద ఉన్న డబ్బులు ఇవ్వాలని యూసుఫ్ నుంచి రూ.450, రెహాన్ నుంచి రూ.550, షేక్ మెహరాజ్ నుంచి రూ.300లను తీసుకెళ్లారు. దీనిపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు షేక్ జహంగీర్, షేక్ ముస్తాక్‌లను సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.